సాక్షి
జోగుళాంబ గద్వాల

గురువారం : 24 : ఏప్రిల్ : 2025



అభివృద్ధికి సహకరించాలి

విజయ డెయిరీ అభివృద్ధికి సహకరించాలని చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి కోరారు.

వివరాలు 10లో ▸



ఏసీబీ వలలో విద్యుత్ ఏఈ

ఇల్లాఘనపురం విద్యుత్ ఏఈ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం

42.8 /23.8

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచే ఎండ తీవ్రత, ఉక్కపోత పెరుగుతుంది. వడగాల్పులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

గద్వాల క్రైం: వేసవి సెలవుల **దృష్ట్యా తల్లిదండ్రులు** పిల్లల విషయంలో అ**ప్రమత్తంగా ఉం**డాలని ఎస్పీ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించిందని, ఈ నేపథ్యంలో సరదా ఆటవిడుపు కోసం బావులు, చెరువులు, నీటి కుంటల్లో పిల్లలు ఈత నేర్చుకునేందుకు వెళ్తుంటారని తెలిపారు. చిన్నారుల సంరక్షణపై వారి కుటుంబ సభ్యులు నిఘా ఉంచాలని, బావులు, చెరువులు, నీటి కుంటల వద్ద పోలీసు నిఘా ఉంటుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వివరించారు.

జోగుళాంబ సన్నిధిలో ప్రముఖుల ప్రత్యేక పూజలు



అలంపూర్: జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారిని జిల్లా నూతన జడ్జి ఎన్. ప్రేమలత, జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మిథున్ తేజతో కలిసి బుధవారం సందర్శించారు. ఆలయ ఈఓ పురేందర్ కుమార్ అర్చకులతో కలిసి వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి అమ్మవారి, స్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు. వీరితోపాటు అడ్వకేట్ బార్ అస్సోయేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు సురేష్ కుమార్, మాజీ ఏజీపీ నరసింహ్మ, సీనియర్ న్యాయవాది నారయణ రెడ్డి ఉన్నారు.

టీవీ సీరియల్ నటులు..

అలాగే, టీవీ సీరియల్ నటులు హరిత, జాకీలు సతీసమేతంగా ఆలయాలను దర్శించుకున్నారు. జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పుస్తకాలు.. విజ్ఞాన భాండాగారాలు

గద్వాల న్యూటౌన్: పుస్తకాలు విజ్ఞాన భాండాగారాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మీనాక్షి అన్నారు. బుధవారం స్థానిక ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు విజ్ఞానాన్ని పెంచడంలో పుస్తకాల పాత్ర ముఖ్యమైనదని చెప్పారు.

ఎందుకీ వెనుకంజ..?

ఇంటర్‌లో నిరాశపరిచిన ఉత్తీర్ణత శాతం

- ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో జిల్లా 20, 21వ స్థానం
- కొరవడుతున్న కార్యాచరణ, పర్యవేక్షణ
- ఫలితాల మెరుగుపై దృష్టి సారించని అధికారులు



గద్వాలటౌన్: విద్యార్థుల ఉజ్వల భవితకు పునాదిగా భావించే ఇంటర్ ఫలితాలు తల్లిదండ్రులను కలవరపెడుతున్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల రెండింటా విద్యార్థులు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. గతేడాది కన్నా ఈ సారి ఉత్తీర్ణత శాతం స్వల్పంగా పెరిగినా రాష్ట్రంలో 20, 21వ స్థానాలలో జిల్లా ఉండటం ఆందోళనకు గురిచేస్తుంది. ప్రత్యేక కార్యచరణ లోపించడం, పర్యవేక్షణ కొరవడటం పిల్లల చదువులపై దుష్ప్రభావం చూపుతుందనే వాదన సర్వత్రా వినిపిస్తోంది. జిల్లాలో మొత్తం 8 ప్రభుత్వ కళాశాలలు, 14 ప్రభుత్వ గురుకుల కళాశాలలు, ఆరు కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, 13 ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్ విద్య కొనసాగుతుంది. ఇంటర్ మొదటి సంవత్సరంలో మొత్తం 3,260 మంది విద్యార్థులకుగాను 1,864 మంది విద్యార్థులు మాత్రమే (57.18శాతం) ఉత్తీర్ణత సాధించి, రాష్ట్రంలో 21వ స్థానంలో నిలిచారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 2,963 మంది విద్యార్థులకుగాను 2,017 మంది విద్యార్థులు మాత్రమే (68.07 శాతం) ఉత్తీర్ణత సాధించి, రాష్ట్రంలోనే 20వ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే.

ప్రభుత్వ కళాశాలల్లో ఇలా..

జిల్లాలోని 8 ప్రభుత్వ కళాశాలల్లో సైతం ఫలితాలు నిరుత్సాహ పర్చాయి. మొదటి సంవత్సరంలో 1,360 మంది విద్యార్థులకు గాను 706 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. అంటే 41.91 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 1,208 మంది విద్యార్థులకు గాను 872 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అంటే 72.18 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాదితో పోల్చితే ఈ సారి ఉత్తీర్ణత శాతం పెరిగింది..

➡ ముఖ్యంగా కొన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఫలితాలు తీవ్ర నిరాశపర్చాయి. ఒక్క కళాశాలలో మినహా మిగిలిన ఏడు కళాశాలలో 60 శాతం ఉత్తీర్ణత దాటలేదు. మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫలితాలు మరి అధ్వానంగా వచ్చాయి. ఫస్టియర్‌లో కేవలం 20 శాతం మాత్రమే ఫలితాలు వచ్చాయి. అలంపూర్‌లో 31 శాతం, మానవపాడులో 37 శాతం మాత్రమే ఉత్తీర్ణత రావడం ఆందోళన కలిగిస్తుంది. గట్టు, ధరూర్ ప్రభుత్వ కళాశాల ఫలితాలు సైతం నిరాశజనకంగా ఉన్నాయి. సెకండియర్‌లో అలంపూర్ మినహా మిగిలిన అన్ని కళాశాలలో మెరుగైన ఫలితాలు వచ్చాయి. ద్వితీయ సంవత్సరంలో గట్టు, అయిజ, అలంపూర్ కళాశాలల ఫలితాలు పర్వాలేదనిపిచ్చాయి.

ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం ఇలా..

కళాశాల	ప్రథమ సం.	ద్వితీయ సం.
గద్వాల ప్రభుత్వ కళాశాల	59	74.8
గద్వాల బాలికల కళాశాల	57	70
ధరూరు కళాశాల	54	77
అలంపూర్ కళాశాల	31	56
గట్టు కళాశాల	46	64
మానవపాడు కళాశాల	37	70
మల్దకల్ కళాశాల	20	86
అయిజ కళాశాల	62.16	73.3

సీఈసీలో మరి దారుణం..

ప్రభుత్వ కళాశాలల సీఈసీ విభాగంలో దారుణమైన ఫలితాలు వచ్చాయి. గట్టు ప్రభుత్వ కళాశాల సీఈసీ ప్రథమ సంవత్సరం తెలుగు మీడియంలో జీరో ఫలితాలు వచ్చాయి. 11 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే అందరూ ఫెయిల్ అయ్యారు. సెకండియర్‌లో 19 మంది విద్యార్థులు పరీక్ష రాస్తే కేవలం ఒక్కరే ఉత్తీర్ణులయ్యారు. మల్దకల్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 24 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే కేవలం ఇద్దరూ మాత్రమే పాస్ అయ్యారు. మానవపాడు కళాశాలలో తెలుగు మీడియంలో పది మందికి ఇద్దరూ, ఇంగ్లీష్ మీడియంలో 14 మందికి నలుగురు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. అలంపూర్‌లో ఇంగ్లీష్ మీడియంలో ఎనిమిది మందికి గాను కేవలం ఒక్కరే పాస్ అయ్యారు. గట్టు, ధరూర్‌లలో హెచ్ఈసీ ప్రథమ సంవత్సరం ఫలితాలు సైతం నిరాశపర్చాయి.

➡ ధరూర్ కళాశాల రెండో సంవత్సరం బైపీసీలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. 22 మంది విద్యార్థులకు గాను 22 మంది ఉత్తీర్ణత సాధించారు. గద్వాల ప్రభుత్వ కో-ఎడ్యుకేషన్ కళాశాల ద్వితీయ సంవత్సరం సీఈసీ విభఈగంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. 31 మంది విద్యార్థులకు 31 మంది పాస్ అయ్యారు.

ఫలితాలపై పునశ్చరణ జరిగేనా..?

ప్రత్యేక ప్రణాళిక రూపొందించి వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు, ప్రత్యేక తర్ఫీదు ఇవ్వడంలో కాస్త ఉదాసీనంగా వ్యవహరించారు. వీటితో పాటు ప్రధానంగా జిల్లాలో సుమారు 200 -250 మంది విద్యార్థుల వరకు పరీక్షలకు గైర్హాజరయ్యారు. వీటి వలన ఫలితాలు ఆశించిన స్థాయిలో రాలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదిలాఉండగా, డీఐఈఓ పోస్టు కొన్నేళ్లుగా ఖాళీగా ఉండటం, కళాశాల ప్రిన్సిపల్‌కే అదనపు బాధ్యతలు అప్పగించి విద్యా సంవత్సరాలు నెట్టుకొస్తున్నారు. కళాశాలల తనిఖీకి వెళ్లి అక్కడ లోటుపాట్లు కన్పించినా అక్కడ సహచర ప్రిన్సిపల్ ఉండటంతో వారిపై చర్యలు తీసుకోకుండా మౌనం వహిస్తుండటంతో ఆ ప్రభావమూ విద్యార్థుల భవిష్యత్తుపై చూపుతోంది. నాణ్యమైన విద్య అందించినప్పుడే ఫలితాలు సైతం మరింత మెరుగ్గా ఉంటాయి. ఆ దిశగా ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి, ఫలితాలపై పునశ్చరణ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కారణాలెన్నో..

ఇంటర్ ఫలితాల్లో ఆశించిన ఉత్తీర్ణత రాకపోవడం వెనుక ఎన్నో కారణాలున్నాయి. జిల్లాలో ఇంటర్ విద్యపై పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ కళాశాలలకు సరైన దిశానిర్దేశం చేయకపోవడం, తరచూ బోధన తీరును సమీక్షించకపోవడం వంటి కారణాల వల్ల ఫలితాలపై ప్రభావం పడిందన్న భావన విద్యావేత్తల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేక తరగతులు నిర్వహించినా విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలపై దృష్టి సారించకపోవడం ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడికి వచ్చే వారంతా పేద కుటుంబాలకు చెందిన వారే. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేయకపోవడంతో ఇతర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు పూర్తిగా తరగతులకు హాజరు కాకుండా మధ్యాహ్నం తర్వాత ఇంటికి వెళ్లిపోయే వారు. దీంతో వారికి అన్ని సబ్జెక్టులపై పట్టు లేకుండా పోయింది. విద్యార్థులు గైర్హాజరవుతున్నా అధ్యాపకులు చూసీ చూడనట్లు వ్యవహరించడం మౌళిక వసతులేమి వంటివి ఫలితాలను దెబ్బతీశాయనే భావన వ్యక్తమవుతుంది.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరగాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా నిరుపేదలైన అర్హులకు మాత్రమే అందించాలన్నారు. ఎల్-1 జాబితాలో ఉన్న 50వేల మంది లబ్ధిదారుల నుంచి నియోజకవర్గానికి 3500 చొప్పున ఏడు వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉందన్నారు. ప్రతి మండలంలో ఎంపిక చేసిన పైలెట్ గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లలో బేస్‌మెంట్ స్థాయి పూర్తి చేసుకున్న 20 మందికి మొదటి విడతగా రూ.1లక్ష చొప్పున నిధులు విడుదల చేశామన్నారు. పనులు వేగవంతంగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా ఎల్ఆర్ఎస్ గడువు ఈనెల 30వ తేదీన ముగుస్తుందని గడువు పెంచే అవకాశం లేనందున అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో నిర్ణీత లక్ష్యం మేరకు పన్ను వసూళ్లు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు హౌసింగ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్ల నియామకం..

గద్వాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్ల నియామకానికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య కాలేజీలో అవసరమైన ట్యూటర్లు, సీనియర్ రెసిడెంట్లు, అసోసియోట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తదితర నియామకానికి సంబంధించిన వివరాలను శనివారం నాటికి అందజేయాలన్నారు. ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఈసమావేశంలో ఆసుపత్రి సూపరిండెంట్ ఇందిర, కాలేజీ ప్రిన్సిపల్ నాగేశ్వర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు అధికారులను ఆదేశించారు. కర్నూల్‌లోని నివాసంలో వారు ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, ఇంట్రా, వాటర్ గ్రిడ్ అధికారులతో మంగళవారం రాత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు జీవనదులైన కృష్ణా, తుంగభద్ర నదుల్లో ప్రస్తుతం నీటి నిల్వలపై ఆరా తీశారు. నదుల్లో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకు చేరుకునే సమయంలో కలుషితమయ్యే అవకాశం ఉందని, నీటి నిల్వలు అడుగంటిన సమయాల్లో ఫిల్టరైజేషన్ సరిగ్గా నిర్వహించాలని సూచించారు. వేసవిలో నీటి నిల్వలు తగ్గిన సమయాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. సాధారణ సమయంలో తాగునీటి కష్టాలు పడే గ్రామాల్లో వేసవిలో మరింత ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని, అలాంటి గ్రామాలను గుర్తించి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు నీటిని అందించాలని, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని అధికారులను సూచించారు. సమావేశంలో అధికారులు వెంకటరమణ, శ్రీధర్ రెడ్డి, పరమేశ్వరి, డీఈలు, ఏఈలు తదితరులు ఉన్నారు.

ఉగ్రదాడిపై పెల్లుబికిన నిరసనలు



జిల్లా కేంద్రంలో కాగడాల ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంఘాల నాయకులు

- కాగడాలతో ర్యాలీ, మృతులకు నివాళి



గద్వాలలో ఉగ్రదాడిని నిరసిస్తూ నిరసన ప్రదర్శన

గద్వాలటౌన్: జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిపై ఆగ్రహావేశాలు పెల్లుబిక్కాయి. ఉగ్రదాడిలో 27 మంది పర్యాటకులు మృత్యువాత పడటంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉగ్రదాడిని నిరసిస్తూ బుధవారం వివిధ సంఘాల నాయకులు, విద్యార్థులు వేర్వేరుగా నిరసనలు వ్యక్తం చేశారు. ఉగ్రదాడిని నిరసిస్తూ వీహెచ్‌పీ, బీజేపీ తదితర సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోట నుంచి కృష్ణవేణి చౌరస్తా వరకు ప్రధాన రహదారుల వెంట భారీ కాగాడాలు, కొవ్వొత్తులు, జాతీయ జెండాలు చేతపట్టి ప్రదర్శన చేపట్టారు. ఉగ్రవాదులకు, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మృతి చెందిన పర్యాటకులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్, బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అప్సర్‌పాష, జిల్లా అధ్యక్షుడు రామంజనేయులు, ధర్మ ప్రసార సమితి ప్రాంత సంయోజక్ జగదీశ్వర్‌రెడ్డి, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు కరేంద్రనాథ్, మాట్లాడారు. ఉగ్ర శక్తులకు వ్యతిరేకంగా పోరాడేందుకు దేశమంతా ఐక్యంగా ఉందన్నారు. పర్యాటకులపై జరిపిన ఉగ్రదాడులకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. దేశంపై ఇలాంటి పిరికిపంద చర్యలకు పాల్పడుతున్న ఉగ్ర మూకలను అంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉగ్రదాడులకు ప్రభుత్వం నుంచి ప్రతిచర్యను దేశ ప్రజలు ఆశిస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు గోపాల్‌రావు ఏక్బోటే, వైండింగ్ రాములు, దేవదాసు, రజక నర్సింహా, విజయ్‌కుమార్, ప్రభాకర్‌గౌడ్, గంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ కల్లుతో బేజారు

కల్లుకు బానిసై తీవ్ర అనారోగ్య సమస్యలతో సతమతం



'ఈ ఫొటోలోని వ్యక్తి పేరు లక్ష్మయ్య. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలకేంద్రానికి చెందిన ఈయన కొన్నేళ్లుగా కల్తీ కల్లు తాగుతుండటంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. మెదడు దెబ్బతిని నోటమాట రాని పరిస్థితికి చేరుకున్నాడు. జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో మెంటల్ హెల్త్ విభాగంలో చికిత్స తీసుకుంటున్నాడు. గ్రామాల్లో విచ్చలవిడిగా కల్తీ కల్లు విక్రయాలు చేపడుతున్నారని, తనలాంటి బాధితులు ఎంతోమంది ఆస్పత్రుల్లో చేరుతున్నారని వాపోయాడు.'

ఏడాదిన్నర కిందట కల్తీ కల్లు సేవించి మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రానికి సమీపంలోని తిమ్మసానిపల్లి, కోయినగర్, దొడ్లోనిపల్లి గ్రామాలకు చెందిన 20 మంది ఒక్కసారిగా అస్వస్థతకు గురికావడం కలకలం రేపింది. జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో చేరి వారం రోజుల పాటు చికిత్స తీసుకున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కల్తీ కల్లు వినియోగిస్తూ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చేరుతున్న వారి క్రమంగా పెరుగుతోంది.



నిత్యం రోగులతో కిటకిటలాడుతున్న ఈ వార్డు నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో ఉన్న ఆర్థోపెడిక్ వార్డు. వీరిలో ఎక్కువగా కల్తీ కల్లు తాగడంతో కళ్లు తిరిగి జారి పడి.. కాళ్లు, చేతులు విరిగిన వారే ఉంటున్నారని వైద్యులు చెబుతున్నారు. నిత్యం కల్లు తాగడంతో చికిత్స చేసేందుకు, మత్తు మందు ఇవ్వాలన్నా డీ టాక్సిఫికేషన్ చేయాల్సి వస్తోంది. ఇందుకు కనీసం 20 రోజుల పాటు సమయం పడుతోంది. అప్పటిదాకా ఆగలేక రోగులు ఇంటికి వెళ్లి నాటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. అక్కడ వైద్యం వికటించి, ఇన్‌ఫెక్షన్లు సోకి దిక్కులేని పరిస్థితుల్లో మళ్లీ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరుతున్నారు.

- నాడీ, మానసిక సమస్యలతో ఆస్పత్రుల్లో చేరుతున్న బాధితులు
- డీ-అడిక్షన్ ప్రక్రియకు సైతం సహకరించని వైనం
- నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పెరుగుతున్న బాధితులు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి జిల్లాలో ఎక్కడబడితే అక్కడ కల్తీకల్లు యథేచ్ఛగా లభ్యమవుతోంది. కల్తీ కల్లుకు బానిసవుతున్న వారు క్రమంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. కల్తీ కల్లు విక్రయాలనే ఆదాయంగా మార్చుకున్నవారు మత్తుకోసం ఎంతటి ప్రమాదకరమైన పదార్థాలను కలిపేందుకైనా వెనుకాడటం లేదు. ప్రమాదకర క్లోరో హైడ్రేట్, డైజోఫామ్, ఆల్ప్రాజోలం తదితర రసాయనాలను వినియోగిస్తుండటంతో కల్తీకల్లు సేవిస్తున్న బాధితులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తిమ్మిర్లు, కళ్లు తిరగడం, ఒంట్లో సత్తువ లేకపోవడం, ఫిట్స్ వంటి సమస్యలతో నడుస్తుండగానే ఒక్కసారిగా కుప్పకూలుతున్నారు. కాళ్లు, చేతులు, ఎముకలు విరిగి ఆస్పత్రుల్లో చేరుతున్నారు. అక్కడ వారి చికిత్సకు సైతం దారుణమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. నిత్యం కల్తీకల్లు ద్వారా మితిమీరిన మత్తుపదార్థాలు వినియోగిస్తుండటంతో ఆపరేషన్ కోసం వైద్యులు ఇచ్చే మత్తు పనిచేయడం లేదు. ఇందుకు వారిని రోజుల తరబడి ఆస్పత్రుల్లో ఉంచుకుని డీటాక్సిఫికేషన్ చికిత్స చేయాల్సి వస్తోంది.

ఆరోగ్య సమస్యల నుంచి ఆత్మహత్యల దాకా..

ఉమ్మడి జిల్లాలోని నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కల్తీకల్లు బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, వృద్ధులు, మహిళలతో సహా కల్తీ కల్లుకు బానిస అవుతున్నారు. ఏళ్ల తరబడి కల్తీ కల్లు సేవిస్తుండటంతో ప్రధానం మెదడు, నాడీ వ్యవస్థ, లివర్ భాగాలు దెబ్బతిని తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారు. చివరికి నోటి నుంచి మాటరాని పరిస్థితికి చేరుకుంటున్నారు. కల్తీకల్లులో వినియోగిస్తున్న మితిమీరిన మత్తు పదార్థాలతో పూర్తిగా బానిసై కల్లు మానేయలేని స్థితికి చేరుకుంటున్నారు. విపరీతమైన మత్తులో గొడవలు పడటం, కుటుంబ కలహాలు, మహిళలపై చేయి చేసుకోవడంతో పాటు క్షణికావేశంలో తమవారినే అంతమొందించేందుకు సిద్ధమవుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. మత్తులో డిప్రెషన్‌కు గురికావడం, తీవ్రమైన దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనలేక ఆత్మహత్యలకు సిద్ధమవుతున్నారు.

కల్తీ కల్లు బాధితులే ఎక్కువ..

జనరల్ ఆస్పత్రిలోని మెడికల్ హెల్త్ సెంటర్‌కు కల్తీ కల్లు బాధితులు ఎక్కువగా వస్తున్నారు. కల్లులో మత్తుకోసం క్లోరో, ఆల్ప్రాజోలం, యాంటీ సైకోటిక్ పదార్థాలను కలుపుతుండటంతో తీవ్రమైన అనారోగ్యానికి గురవుతున్నారు. నిత్యం కల్తీకల్లు సేవించడం వల్ల బ్రెయిన్, లివర్, నాడీ సంబంధ సమస్యలకు లోనవుతున్నారు. చివరికి నోట మాటరాని పరిస్థితి ఎదురవుతోంది.

– డాక్టర్ అంబుజ, సైకియాట్రిస్ట్, జిల్లా మెడికల్ హెల్త్ సెంటర్, నాగర్‌కర్నూల్

కౌన్సెలింగ్ ద్వారా చికిత్స..

కల్తీకల్లు వినియోగంతో నరాల బలహీనత, ఫిట్స్, తిమ్మిర్లు రావడం, చేతు లు, కళ్లలో మంటలతో ఆస్పత్రులకు వస్తున్నారు. వారికి కౌన్సెలింగ్, మందులు ఇచ్చి పంపిస్తున్నాం. తీవ్రమైన కేసులు ఉన్నవారిని హైదరాబాద్‌కు పంపుతున్నాం.

– డాక్టర్ రఘు, సూపరింటెండెంట్, జనరల్ ఆస్పత్రి, నాగర్‌కర్నూల్

పీసీసీ అబ్జర్వర్ల నియామకం

సాక్షి, నాగర్‌కర్నూల్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జిల్లాల వారీగా అబ్జర్వర్లను నియమించింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఒక్కో జిల్లాకు ఇద్దరు చొప్పున పార్టీ అబ్జర్వర్ల జాబితాను ప్రకటించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు దొమ్మటి సాంబయ్య, గజ్జి భాస్కర్ యాదవ్, నాగర్‌కర్నూల్‌కు టి.బెల్లయ్య నాయక్, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, వనపర్తికి ఎ.సంజీవ్ యాదవ్, గౌరి సతీశ్, జోగుళాంబ గద్వాలకు దీపక్ జైన్, బి.వెంకటేశ్ ముదిరాజ్, నారాయణపేటకు ఎం.వేణుగౌడ్, బొజ్జ సంధ్యారెడ్డి పార్టీ అబ్జర్వర్లుగా కొనసాగనున్నారు. వీరు పార్టీ తరఫున ఆయా జిల్లాల్లో పార్టీ అధ్యక్షులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీకి చెందిన వివిధ విభాగాల ప్రతినిధులతో సమన్వయం చేయనున్నారు. ఎప్పటికప్పుడు పార్టీ నాయకుల పనితీరును అధిష్టానానికి నివేదించనున్నారు.

భూ భారతితో రైతులకు మేలు



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ

కేటీదొడ్డి: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంతో రైతులకు మేలు చేకూరుతుందని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం కేటీదొడ్డిలోని రైతువేదికలో భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి చట్టం రూపొందించిందని, భూ పరిపాలన వ్యవస్థ అనేక దశల్లో అభివృద్ధి చెందిందని గతంలో జరిగిన కొన్ని చట్టాలు, సర్వేలు, పాసుబుక్‌లు, ఆర్.ఓ.ఆర్ చట్టం వంటి చర్యలను గుర్తుచేశారు. అనేక సమస్యలకు భూ భారతి చట్టం ద్వార పరిష్కారం లభించనుందని, ఇందులో ఆరు మాడ్యూల్స్ మాత్రమే ఉండడంతో దరఖాస్తు ప్రక్రియ సులభంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస రావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతు, గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, తహసీల్దార్ హరికృష్ణ, నాయబ్ తహసీల్దార్ శివశంకర్, ఏఓ సాజీద్ రెహమ్మాన్, ఆర్ఐ దేవేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


రామన్‌గౌడ్ (ఫైల్)

వీపనగండ్ల: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వీపనగండ్ల మండలం కల్వరాలలో చోటు చేసుకుంది. ఎస్ఐ కె.రాణి వివరాల మేరకు.. కల్వరాలకు చెందిన రామన్‌గౌడ్ (51) మంగళవారం రాత్రి తన ఇంట్లోని బాత్‌రూంలో నీళ్లు పట్టేందుకు విద్యుత్ మోటారు ఆన్ చేశాడు. నీళ్లు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య రజిని, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. అయితే ఈ ఘటన జరిగిన సమయంలో కుటుంబ సభ్యులు ఎవరూ లేరని.. చుట్టు పక్కల వారు గమనించి వారికి సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. రామన్‌గౌడ్ మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

ఆటో ఢీకొని యువకుడి దుర్మరణం

మరికల్: ఆటో ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతి చెందిన ఘటన పస్పుల స్టేజీ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మరికల్‌కు చెందిన టంకర శివ(23) పస్పులలో మోటార్ మరమ్మతు చేసి రాత్రి బైక్‌పై మరికల్‌కు తిరిగి వస్తుండగా పస్పుల స్టేజీ వద్ద ఎదురుగా వస్తున్న పాల ఆటో వేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఎల్లయ్య, మసుద్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు


- ఒకరి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి కారు వేగంగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన గార్లపాడ్ రమేష్(55) బుధవారం ఉదయం 8.30 ప్రాంతంలో మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్ల వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుంటే మార్గమధ్యలోని అప్పన్నపల్లి మారుతీ షోరూం సమీపంలో వెనుక నుంచి వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. రమేష్ తలకు తీవ్ర గాయాలు కాగా వెంటనే జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

శుభకార్యానికి వెళ్లివస్తుండగా..

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలు సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలు.. రేవల్లి మండలం నాగపూర్ గ్రామానికి చెందిన మల్లయ్య (52) బైక్‌పై జిల్లా కేంద్రంలో ఓ శుభకార్యానికి వస్తుండగా ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


బాలమణి (ఫైల్)

కొత్తకోట రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతిచెందిన ఘటన కొత్తకోట మండలం కానాయపల్లి సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఏదుల మండలం ముత్తిరెడ్డిపల్లికి చెందిన చెన్నమ్మ, కుర్మయ్య దంపతులు కొన్నేళ్లుగా వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో నివాసముంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి రెండవ కుమార్తె బాలమణి (28) భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమె ఆరేళ్లుగా కొత్తకోట మండలం కానాయపల్లి శివారులోని బుచ్చారెడ్డి ఇంట్లో పనిమనిషిగా పనులు చేస్తుండేది. అతడి ఇంట్లో బాలమణికి కేటాయించిన గదిలోనే ఆమె అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. మృతురాలి తల్లి చెన్నమ్మ ఫిర్యాదు మేరకు బుచ్చారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కొత్తకోట రూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఎస్ఐ ఆనంద్ వివరాల మేరకు.. మండలంలోని అమడబాకులకు చెందిన గొల్ల బండలయ్య (80) గత నెల 26న కొత్తకోటలో నడుచుకుంటూ వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో బండలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏసీబీ వలలో విద్యుత్ ఏఈ

- రైస్‌మిల్లుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు రూ. 20వేలు డిమాండ్
- కాంట్రాక్టర్ నుంచి రూ.10వేలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ




ఏసీబీకి పట్టుబడిన ఖిల్లాగణపురం మండల విద్యుత్ ఏఈ కొండయ్య

వనపర్తి: లంచం తీసుకుంటూ విద్యుత్‌శాఖ ఏఈ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన ఘటన వనపర్తి జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ వివరాల మేరకు.. ఖిల్లాఘనపురం మండలం మల్కాపురం గ్రామ శివారులో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి తిరుమల ఆగ్రో ఇండస్ట్రీస్ పేరిట రైస్‌మిల్లు నిర్మాణం చేపట్టాడు. ఈ రైస్‌మిల్లుకు విద్యుత్ సౌకర్యం కోసం టీజీఎస్పీడీఎల్‌కు డీడీ చెల్లించారు. విద్యుత్‌శాఖ అధికారులు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి.. ఆ పనులను సలీం అనే కాంట్రాక్టర్‌కు అప్పగించారు. పనులు పూర్తయిన తర్వాత విద్యుత్ కనెక్షన్ ఇవ్వాల్సిందిగా సదరు కాంట్రాక్టర్ విద్యుత్‌శాఖ ఏఈ కొండయ్యను కోరగా.. రూ. 20వేలు డిమాండ్ చేశాడు. పనులు కొనసాగుతున్న సమయంలోనే సదరు ఏఈ కొంత మొత్తం (రూ. 30వేలు) లంచంగా తీసుకున్నాడు. విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు మరో రూ. 20వేలు డిమాండ్ చేయడంతో కాంట్రాక్టర్ సలీం ఏసీబీని ఆశ్రయించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఈ కార్యాలయం వద్ద ఉన్న సదరు కాంట్రాక్టర్‌ను డబ్బులు ఇవ్వాల్సిందిగా ఏఈ డిమాండ్ చేశాడు. అయితే అప్పటికే ఏసీబీ అధికారులతో టచ్‌లో ఉన్న కాంట్రాక్టర్.. వారిచ్చిన డబ్బును ఏఈకి ఇచ్చారు. వాటిని తీసుకుని ప్యాంటు జేబులో పెట్టుకున్న వెంటనే ఏసీబీ అధికారులు పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. ఏఈ కొండయ్యపై కేసు నమోదుచేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

అవినీతికి అడ్డుకట్ట ఏది?

గతేడాది మే 31న విద్యుత్‌శాఖలో ముగ్గురు అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఈ నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు లంచం అడిగితే తమకు సమాచారం ఇవ్వాలంటూ కార్యాలయంలో పలు చోట్ల స్టిక్కర్లు అంటించారు. అయితే ఎస్ఈ, డీఈఈ, ఏఈ స్థాయి అధికారులు ఒకేసారి ఏసీబీకి పట్టుబడిన 11 నెలల వ్యవధిలోనే మరో అధికారి ఏసీబీకి చిక్కడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ వరుస ఘటనలతో విద్యుత్‌శాఖలో ఏమేర అవినీతి జరుగుతుందనే విషయం సామాన్యులు సైతం అంచనా వేసే స్థితికి వచ్చిందంటూ స్థానికుల్లో చర్చ వినిపిస్తోంది.

నిషేధిత ప్రదేశంలో తవ్వకాలు సాధ్యమేనా?


సొరంగంలో కంచె ఏర్పాటుచేసిన ప్రదేశంలో చేపట్టిన సహాయక చర్యలు

- ఎస్ఎల్‌బీసీ సొరంగంలో లభించని ఆరుగురు కార్మికుల ఆచూకీ
- మరో రెండు రోజుల్లో ముగియనున్న సహాయక చర్యలు
- నేడు ప్రత్యేకాధికారితో టెక్నికల్ కమిటీ సమావేశం

అచ్చంపేట: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో గుర్తించిన నిషేధిత ప్రదేశంలో తవ్వకాలు చేపట్టడం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. సొరంగం ప్రమాదం జరిగి బుధవారం నాటికి 61 రోజులు అవుతుంది. నాటి నుంచి సహాయక చర్యలు కొనసాగుతున్నా.. గల్లంతైన ఆరుగురి కార్మికుల ఆచూకీ మాత్రం లభించడం లేదు. సొరంగం పైకప్పు కుప్పకూలిన 13.936 కి.మీ. నుంచి ఇన్‌లేట్ వైపు 324 మీటర్ల వరకు మట్టి, బురద, పెద్దపెద్ద బండరాళ్లు, టీబీఎం మిషన్ ప్లాట్‌ఫాం శిథిలాలు భారీగా పేరుకుపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 12 విభాగాల ఉన్నతాధికారులు ప్రమాద ప్రదేశాన్ని డీ–2, డీ–1గా గుర్తించారు. సొరంగం పైకప్పు కూలిన 43 మీటర్ల ప్రదేశాన్ని డీ–1 డేంజన్ జోన్‌గా గుర్తించారు. భారీగా ఉబ్బికి వస్తున్న నీటి ఊట కారణంగా ఇక్కడ ఎలాంటి తవ్వకాలు చేపట్టినా మరింత ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. దీంతో ఈ ప్రదేశంలో కంచె ఏర్పాటు చేశారు. ప్రమాదం జరిగిన చోట చివర కాంక్రీట్ సెగ్మెంట్‌లు కూలే ప్రమాదం ఉందని గుర్తించి.. రక్షణ కోసం సింగరేణి మైన్స్ రెస్క్యూ బృందాలు టైగర్ టింబర్ ఉడెన్ కాగ్స్ సపోర్టు ఏర్పాటుచేశారు. నిషేధిత ప్రదేశం మినహా డీ–2 ప్రాంతంలో 281 మీటర్ల మేర పేరుకుపోయిన మట్టి, బురద, టీబీఎం భాగాలు, రాళ్లను తొలగించే పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. చివరగా సొరంగం ఇరువైపులా ఆరు మీటర్ల మేర ఉన్న టీబీఎం ప్లాట్‌ఫాం భాగాలను దక్షిణమధ్య రైల్వే సిబ్బంది ప్లాస్మా కట్టర్‌తో కట్ చేసి లోకో ట్రెస్ ద్వారా సొరంగం బయటకు తరలిస్తున్నారు. ఉబ్బికి వస్తున్న నీటిని సొరంగం మధ్యగుండా దారి ఏర్పాటుచేసి.. భారీ మోటార్ల సాయంతో కృష్ణానదిలోకి పంపింగ్ చేస్తున్నారు. సహాయక చర్యలు మరో రెండు రోజుల్లో పూర్తి అవుతాయని రెస్క్యూ సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుతం ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ, హైడ్రా, దక్షిణమధ్య రైల్వే, ఆర్మీ, ర్యాట్ హోల్ మైనర్స్ తదితర బృందాల సిబ్బంది నిషేధిత ప్రదేశం వరకు శిథిలాలను తొలగిస్తున్నారు. డీ–2 ప్రదేశం వరకు శిథిలాలను తొలగించినా ఆరుగురి కార్మికుల జాడ లభించలేదు. నిషేధిత ప్రదేశంలో ఉండి ఉండవచ్చని సహాయక సిబ్బంది భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం దోమలపెంట ఎస్ఎల్‌బీసీ ఇన్‌లేట్ జేపీ కార్యాలయం వద్ద ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి ఆధ్వర్యంలో టెక్నికల్ కమిటీ సమావేశం కానుంది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, చేపట్టాల్సిన సహాయక చర్యలపై ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు. టెక్నికల్ కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిషేధిత ప్రదేశంలో తవ్వకాలు చేపట్టాలా లేదా అనే దానిపై నిర్ణయం తీసుకోనుంది.


మెరిసిన పేదింటి విద్యాకుసుమం

- ఇంటర్‌లో మొదటి ర్యాంకు సాధించిన రాయాపురం లావణ్య


విద్యార్థిని లావణ్యను అభినందిస్తున్న బల్గెర హనుమంతు నాయుడు

గట్టు: ఇంటర్ ఫలితాల్లో పేదింటి విద్యాకుసుమం మెరిసింది. పుట్టింది పూరి గుడిసెలో అయినా చదువులో మాత్రం ఏకంగా రాష్ట్రస్థాయిలో సత్తా చాటింది. గట్టు మండలం రాయాపురం గ్రామానికి చెందిన లావణ్య ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో 439/440 మార్కులతో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించింది. సామాన్య రైతు కుటుంబం అయిన బోయ నర్సమ్మ, ఆటో లక్ష్మణ్‌కు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె లావణ్య 1, 2 తరగతులు బల్గెరలో, 3 నుంచి 5 తరగతులు ఆలూరులో, 6 నుంచి 10వ తరగతి వరకు కేటిదొడ్డి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుకుంది. 10వ తరగతిలో 9.8 గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించిన లావణ్య.. ఇంటర్ బాలానగర్ గురుకులంలో చదువుతుంది. మొదటి సంవత్సరం బైపీసీలో అత్యధికంగా 439/440 మార్కులు సాధించి రాష్ట్ర టాపర్‌గా నిలిచింది. గ్రామీణ పేదింటి విద్యార్థిని రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు రాజుసాగర్, శ్రీనివాసులు, వీరేష్, రంగస్వామితో పాటు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బల్గెర హనుమంతు నాయుడు బుధవారం విద్యార్థిని లావణ్యను సన్మానించి అభినందించారు.

మార్కెట్‌కు పోటెత్తిన ఉల్లి


దేవరకద్ర మార్కెట్‌లో విక్రయానికి వచ్చిన ఉల్లి

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్ యార్డులో సీజన్ కావడంతో బుధవారం పెద్ద ఎత్తున ఉల్లి విక్రయాలు జరిగాయి. మార్కెట్‌లో ఉదయం పది గంటలకు ఉల్లి వేలం ప్రారంభమై మధ్యాహ్నం వరకు సాగింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు, స్థానిక వ్యాపారులు ఉల్లి విక్రయించేందుకు పోటీపడ్డారు. ఉల్లి నిల్వ సామర్థ్యం అధికంగా ఉండటంతో వినియోగదారులు మార్కెట్‌కు పెద్దఎత్తున తరలించారు. మార్కెట్ బయట కూడా రైతులు ఉల్లి విక్రయాలు జరిపారు.

బస్తా ధర రూ.800

మార్కెట్‌లో ఉల్లి బహిరంగ వేలంలో గరిష్ఠంగా రూ.1,600, కనిష్ఠంగా రూ.1,000 వరకు ధర పలికింది. 50 కేజీల ఉల్లి బస్తా గరిష్ఠంగా రూ.800, కనిష్ఠంగా రూ.500కు విక్రయించారు. మార్కెట్‌కు దాదాపు మూడు వేల బస్తాల ఉల్లి విక్రయానికి రాగా, మార్కెట్ బయట మరో రెండు వేల బస్తాలు అమ్మకాలు జరిగినట్లు అధికారులు తెలిపారు.

ఆర్ఎన్ఆర్ ధర రూ. 2209...

బుధవారం మధ్యాహ్నం జరిగిన టెండర్లలో ఆర్ఎన్ఆర్ ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,209, కనిష్ఠంగా రూ.1,700గా నమోదైంది. హంస ధాన్యం ధర గరిష్ఠంగా రూ.1,913, కనిష్ఠంగా రూ.1,622, ఆముదాలకు గరిష్ఠంగా రూ.6000 ధర లభించింది. మార్కెట్‌కు దాదాపు రెండు వేల బస్తాల ధాన్యం వచ్చినట్లు మార్కెట్ అధికారులు పేర్కొన్నారు.

ప్రశాంత్‌రెడ్డి హత్య కుట్ర కేసులో ఇద్దరి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకి

భూత్పూర్: దేవరకద్ర బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండా ప్రశాంత్‌రెడ్డి హత్య కుట్ర కేసులో ఇద్దరు నిందితులను బుధవారం అరెస్ట్ చేసినట్లు మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి తెలిపారు. ఈ కేసులో ఉన్న మరో నిందితుడు శ్రీకాంత్ పరారీలో ఉన్నారని.. అనుమానితులుగా ఉన్న రాఘవేందర్‌రెడ్డి అలియాస్ చిన్న, శ్రీకాంత్‌యాదవ్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బుధవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణతో కలిసి వివరాలు వెల్లడించారు. అరుణాచలం నవీన్‌కుమార్ తండ్రి హత్య కేసులో కొండా ప్రశాంత్‌రెడ్డి ప్రధాన నిందితుడిగా ఉన్నాడని, అలాగే తిమ్మసానిపల్లికి చెందిన రూప్‌సింగ్ తండ్రి వద్ద ఇటుకలు కొనుగోలు చేసి రూ.40 వేలు ఇవ్వకుండా ప్రశాంత్‌రెడ్డి బెదిరించారని తెలిపారు. రూప్‌సింగ్ తనకు జరిగిన అన్యాయాన్ని అరుణాచలం నవీన్‌కుమార్‌ను కలిసి చెప్పగా తనకు రూ.5 లక్షలిస్తే కొండా ప్రశాంత్‌రెడ్డిని చంపుతానని తెలుపగా, రూ.లక్ష ఉన్నాయని, చంపాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం అరుణాచలం నవీన్ తన స్నేహితుడు కర్ణాటకలోని పుట్‌పాక్‌కు చెందిన శ్రీకాంత్‌తో ప్రశాంత్‌రెడ్డిని హత్య చేయించడానికి రెండు నెలలుగా మాటు వేసుకుని ఉన్నారు. అయితే అరుణాచలం నవీన్ తండ్రి హత్య కేసులో ఏ–2గా ఉన్న కుమ్మరి నర్సింహ విషయం తెలుసుకోవడానికి రూప్‌సింగ్‌కు ఫోన్ చేయగా కొండా ప్రశాంత్‌రెడ్డిని హత్య చేయడానికి చేసిన కుట్ర వివరాలు వెల్లడించారని.. ఇద్దరి మధ్య జరిగిన సంభాషణను ఫోన్‌లో రికార్డు చేసి విషయాన్ని కొండా ప్రశాంత్‌రెడ్డి తెలిపారని వివరించారు. దీంతో కొండా ప్రశాంత్‌రెడ్డి దేవరకద్ర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అరుణాచలం నవీన్, రూప్‌సింగ్‌ను పట్టుకొని విచారించగా నేరం అంగీకరించారని ఎస్పీ వెల్లడించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ చేయగా మరో నిందితుడు శ్రీకాంత్ కోసం గాలిస్తున్నామని తెలిపారు.

కొనసాగుతున్న రైల్వే వంతెన పనులు


రైల్వే వంతెనపై చేపట్టిన గడ్డర్ల బిగింపు పనులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సిగ్నల్‌గడ్డ వద్ద రైల్వే వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మంగళవారం ట్రయల్ రన్ విజయవంతం కావడంతో బుధవారం మూడు గడ్డర్లను బిగించగా.. మరో రెండు గడ్డర్లను గురువారం బిగించనున్నారు. దీంతో వంతెనకు సంబంధించి కీలక ఘట్టం ముగిసినట్లవుతుంది. రైల్వే అధికారులు మధ్యాహ్నం 1.15 గంటలకు రైళ్ల రాకపోకలు నిలిపివేయగా భారీ క్రేన్ సాయంతో మొదటి గడ్డర్‌ను వంతెన గోడలపై ఏర్పాటుచేసి ప్లేట్లపై అమర్చారు. తర్వాత రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. తిరిగి మధ్యాహ్నం 2.45 గంటలకు రైల్వే అధికారులు మరోమారు రైళ్ల రాకపోకలు నిలిపివేయడంతో రెండు గడ్డర్లను అమర్చారు. జాతీయ రహదారులశాఖ ఈఈ నాగేందర్, డీఈ రాజేందర్, ఏఈ రవికుమార్ పనులను పర్యవేక్షించారు. గురువారం మధ్యాహ్నం 1.15 గంటలకు తిరిగి గడ్డర్ల బిగింపు కార్యక్రమం కొనసాగనుంది. ఈ సందర్భంగా జాతీయ రహదారులశాఖ అధికారులు మాట్లాడుతూ.. వంతెన పనుల్లో కీలక ఘట్టం పూర్తి కావచ్చిందని, గడ్డర్లు, ఇంటర్నల్, ఎండ్ డయాఫ్రేమ్స్ బిగించిన తర్వాత స్లాబ్ నిర్మాణం ప్రారంభిస్తామని చెప్పారు. జూన్ చివరి వారం లేదా జులై మొదటి వారంలో వంతెనపై రాకపోకలు కొనసాగుతాయని తెలిపారు.

కారు, బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు

తెలకపల్లి: కారు, బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం బొప్పల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ కారులో అచ్చంపేట వైపు వెళ్తున్నాడు. లక్నారం గ్రామానికి చెందిన భీముడు బైకుపై తెలకపల్లికి వెళ్తుండగా మండలంలోని రాకొండ గ్రామ సమీపంలో కారు, బైకు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రవీన్, భీముడికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

విజయ డెయిరీ అభివృద్ధికి సహకరించాలి

- పాడి రైతులే బ్రాండ్ అంబాసిడర్లు
- విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి


మాట్లాడుతున్న జయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి

కల్వకుర్తి రూరల్: విజయ డెయిరీ లాభాల బాటలో నడవాలంటే రైతులే ప్రచారకర్తలుగా మారాలని విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో జిల్లా అధికారి ధనరాజ్ అధ్యక్షతన డివిజన్ పరిధిలోని పాడి రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన పొరపాట్లు పాడి రైతులకు గుదిబండగా మారాయని.. ఇతర ప్రాంతాల్లో పాల విక్రయం అధికంగా ఉండటంతో రాష్ట్రంలో పాల సేకరణ పెంచాలనే లక్ష్యంతో ధర పెంచిందన్నారు. దీంతో రోజు 2.25 లక్షల లీటర్ల పాల సేకరణ ఉండగా.. అది ఒక్కసారిగా 4.50 లక్షల లీటర్లకు పెరిగిందని, ప్రైవేట్ డెయిరీలు పక్క రాష్ట్రాల్లో పాలను కొనుగోలు చేయడంతో విజయ డెయిరీ నష్టాల్లో కూరుకుపోయిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో 15 నెలలుగా అనేక సందర్భాల్లో చర్చించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టామని వివరించారు. విజయ డెయిరీ అభివృద్ధికి ప్రతి ఒక్క రైతు కృషి చేయాలని.. గేదె పాలు అధికంగా సేకరించాలన్నారు. మార్కెట్‌లో పాల ధరను నిర్ణయించే శక్తి విజయ డెయిరీకే ఉందని చెప్పారు. రోజు రెండు లక్షల లీటర్ల పాలు మిగిలిపోతున్నాయని.. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గురుకులాలు, అంగన్‌వాడీలు, దేవాదాయశాఖకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా పార్లర్లు..

రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి పార్లర్లు ఏర్పాటు చేస్తున్నామని.. హైదరాబాద్‌లోనే 500 ఉండనున్నాయని, వీటిలో అన్నిరకాల పదార్థాలు విక్రయిస్తామని అమిత్‌రెడ్డి తెలిపారు. వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే ఆరు నెలల్లో పాడి రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు. పలువురు రైతులు సమావేశంలో పాల ధరపై తమ అభిప్రాయాలు తెలిపారు. రాయితీ విత్తనాలను అన్నదాతలకు చైర్మన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రాచమళ్ల శ్రీనివాస్, జనరల్ మేనేజర్ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా ప్రభుత్వం

వంగూరు: పాడి రైతులను ఆదుకునేందుకు విజయ డెయిరీ తో పాటు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొండారెడ్డిపల్లిలో నిర్మిస్తున్న బల్క్ మిల్క్ సెంటర్‌ను పరిశీలించిన అనంతరం పాడి రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైతులకు దాదాపుగా బకాయి బిల్లులు చెల్లించామని.. రానున్న రోజుల్లో ఎప్పటి బిల్లులు అప్పుడే ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో పాల ఉత్పత్తి అధికమని.. అందుకే బల్క్ కూలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నెలరోజుల్లో పనులు పూర్తిచేసి పాల సేకరణ జరగాలన్నారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న కంటి వైద్య శిబిరాన్ని పరిశీలించారు. గ్రామస్తులు వేమారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలమూరులో 9 మంది జీహెచ్‌ఎంలకు నోటీసులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ స్పౌజ్ బదిలీల్లో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న 9మంది జీహెచ్‌ఎంలకు ఆర్‌జేడీ కార్యాలయం నుంచి నోటీసులు జారీ అయ్యాయి. బదిలీల్లో తమ స్పౌజ్ ఆప్షన్ పెట్టుకునేందుకు అవకాశం ఉండగా.. స్పౌజ్ పనిచేస్తున్న పాఠశాల సమీపంలో ఆప్షన్ పెట్టుకోకుండా హెచ్‌ఆర్‌ఏ పాఠశాలలకు ఆప్షన్ పెట్టుకున్నారని 'సాక్షి'లో సైతం పలుమార్లు కథనాలు వెలువడ్డాయి. అప్పట్లో నోటీసులు జారీ చేసిన అధికారులు విచారణ పూర్తిచేశారు. అనంతరం జిల్లాలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న 9మంది జీహెచ్‌ఎంలపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని మరోమారు నోటీసులు ఇచ్చినట్లు డీఈఓ ప్రవీణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణీత గడువులోగా సదరు జీహెచ్‌ఎంలు నోటీసులకు స్పందించి వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంలపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం ఉందని.. వీరిపై త్వరలో అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాల్లో చర్చ సాగుతోంది.

తండ్రిని హత్య చేసిన తనయుడికి రిమాండ్

బల్మూర్: మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని తనయుడే తండ్రిని కొట్టి చంపిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అచ్చంపేట సీఐ రవీందర్ తెలిపిన వివరాలు.. బల్మూర్ మండలం కొండనాగులలో ఈనెల 12న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఎర్రం శ్రీను(60) ఘటనలో మృతుని భార్య ఉశమ్మ ఫిర్యాదు మేరకు విచారణలో అనుమానితుడైన కుమారుడు రాంప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా మద్యానికి డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో కొట్టడంతోనే మృతి చెందినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి కల్వకుర్తి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.